క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కడెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కడెం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయాశాఖల అధికారులు తమ నివేదికలతో సకాలంలో హాజరవాలని సూచించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. 21 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో నిర్వహించే శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న దినేశ్

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లెలో కడమంచి రాజేశ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన కొండేరి దినేష్ వాట్సాప్ గ్రూపుల ద్వారా సేకరించిన రూ.13వేలను మంగళవారం బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్యం కోసం దాతలు 95337 19636 నెంబర్‌కు ఆర్థిక సాయాన్ని ఫోన్‌పే, గూగుల్ పే చేయాలని బాధితుడు వేడుకున్నాడు.

ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ట్రై సైకిళ్లు అందజేత

నిర్మల్‌టౌన్: సామాజిక సేవలో భాగంగా పట్టణంలోని శాంతినగర్ చౌరస్తా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఇద్దరు దివ్యాంగులకు మంగళవారం రూ.30వేల విలువైన ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఏటా దేశవ్యాప్తంగా ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రూ.వేల కోట్లతో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకులో ఏర్పాటు చేసిన ఈ చీఫ్ మేనేజర్ సత్యనారాయణ, క్యాషియర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ మహిళా రైతుగా లావణ్య

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన చిలుకూరి తిరుమలగిరి భార్య లావణ్య ఉత్తమ మహిళా రైతుగా అవార్డు పొందింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మహిళా దినోత్సవ వేడుకల్లో డీఆర్డీవో విజయలక్ష్మి చేతుల మీదుగా అవార్డు అందుకుంది. గ్రామంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఫిష్ పాండ్, ఆయిల్‌పాం, కూరగాయలు, వరి వంటి పంటలను వినూత్నంగా సాగు చేస్తున్నందుకు ప్రశంసాపత్రం, అవార్డు అందజేశారు.

మొక్కలకు నీరందించాలి

పెంబి: గ్రామాల్లోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. మంగళవారం మండలంలోని గుమ్మెనఎంగ్లాపూర్, దొందారి, చాకిరేవు గ్రామాల్లోని నర్సరీలను ఎంపీవో రత్నాకర్‌రావుతో కలిసి సందర్శించారు. నర్సరీల్లో షేడ్‌నెట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

గోవిందమాంబకు 'సారె'



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళలు

ఖానాపూర్: పట్టణంలోని శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీశైవ క్షేత్ర వనితాశక్తి ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం సారె సమర్పించారు. 'మనసారా మనసారె' కార్యక్రమంలో భాగంగా పురోహితులు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజ నిర్వహించి ఒడిబియ్యం పోసి చీరె, సారెను సమర్పించారు. జితేందర్, మాధవి, సరిత, వాసవి, గీతారాణి, రాధిక, అన్నపూర్ణ, మానస, స్రవంతి, వరలక్ష్మి, వనజ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అవగాహన

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం, ఆకొండపేట గ్రామాల్లో మంగళవారం ఈవీఎంల పనితీరుపై పలువురు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆర్‌ఐ గంగన్న ఓటుహక్కు వినియోగించుకునే విధానం వివరించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం వీడ్కోలు వేడుకలు అలరించాయి. తొమ్మిదో తరగతి విద్యార్థులు.. పదో తరగతి వారికి వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం నరేందర్ మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, పాఠశాల పేరు నిలబెట్టాలని పదో తరగతి విద్యార్థులకు సూచించారు. నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు శంకర్, భూమన్నయాదవ్, మాధవ్‌రావ్, సుదర్శన్, రమేశ్, గంగారాణి, సుజాతాదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మి కాంత్, సీఆర్పీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



తానూరు: ఎల్విలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం విద్యాధర్, ఉపాధ్యాయులు కడారి దశరథ్, మల్లికార్జున్, సత్యనారాయణ, శ్రీనివాస్, కృష్ణారావు, గజేందర్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

లోకల్ వెల్మల్ ప్రాథమికోన్నత పాఠశాలలో

సోన్: మండలంలోని లోకల్‌వెల్మల్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. హాజరైన అతిథులను సన్మానించారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎంఈవో శంకర్ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మధుకర్‌రావు, మారెడ్డి శ్రీనివాస్, గ్రామ ప్రత్యేకాధికారి వినోద్ కుమార్, హరీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మల్కాగౌడ్, ఉపాధ్యాయులు దేవేందర్, గంగాధర్, రాజేందర్‌రెడ్డి, సుధీర్‌కుమార్, శైలజ, సౌజన్య, గోదావరి, గంగాధర్, సీఆర్పీ వసంతలక్ష్మి ఉన్నారు.



భైంసారూరల్ : నృత్యం చేస్తున్న విద్యార్థులు

స్పర్శలేని మచ్చలుంటే వైద్యుల్ని సంప్రదించాలి

నిర్మల్: శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే ఆందోళన చెందకుండా వైద్యుల్ని సంప్రదించాలని సారంగపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి వేదవ్యాస్ అన్నారు. మంగళవారం సారంగపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో లెప్రసీ(కుష్ఠు) వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకువైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి శరీరంపై తెలుపు, గోధుమరంగులో మచ్చలున్నవారి వివరాలు సేకరించారు. అనుమానితులను పీహెచ్‌సీకి రెఫర్ చేశారు. వైద్యాధికారి గ్రామాల్లో లెప్రసీ నిర్ధారణ పరీక్షల కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లెప్రసీని బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) ద్వారా పూర్తిగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.



జామ్‌లో పరిశీలిస్తున్న వైద్యాధికారి వేదవ్యాస్

సోన్: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాదాపూర్‌లో మంగళవారం కుష్ఠు వ్యాధిపై సర్వే నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ పురుషోత్తం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి స్పర్శ లేని మచ్చలున్న వారి వివరాలు సేకరించారు. ఎన్‌డీటీ చికిత్స ద్వారా కుష్ఠు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శాంతమ్మ, ఆశవర్కర్లు పద్మ, దీనా, రాణి పాల్గొన్నారు.



సోన్: మాదాపూర్‌లో పరీక్ష చేస్తున్న సిబ్బంది

ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయాలి

కుంటాల: రైతులు ఆధునిక పద్ధతుల్లో సేద్యం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో మండల రైతులతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. మామిడిలో పిందె, పూత రాలడంపై సంగారెడ్డిలోని పండ్ల పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుచరిత అవగాహన కల్పించారు. ప్రస్తుత వేసవిలో అధిక ఉష్ణోగ్రతతో పంటలకు నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జగిత్యాల ఏడీఆర్ డాక్టర్ జి.శ్రీనివాస్ అవగాహన కల్పించారు. కుంటాల రైతువేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో భైంసా ఏడీఏ వీణ, ఏవోలు సోమలింగారెడ్డి, రామచందర్ నాయక్, వికార్ హైమద్, ఏఈవోలు శ్రీధర్, మహేశ్, గణేశ్, ప్రగతి, రైతులు పాల్గొన్నారు.



లోకేశ్వరం రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్

లోకేశ్వరంలో..

లోకేశ్వరం: లోకేశ్వరం రైతువేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో మండలంలోని రామయంపేట రైతులు, డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు. రైతులు అడిగే ప్రశ్నలకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సుచరిత సమాధానం చెప్పారు. మామిడి పిందెలు రాలకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్, ఏవో గణేశ్, ఏఈవో మౌనిక, భూమేశ్ పాల్గొన్నారు.

సారంగపూర్‌లో..

నిర్మల్: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సారంగపూర్ రైతువేదికలో అన్నదాతలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల్లో సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఏఓ రాజశేఖర్‌రెడ్డి, ఏఈవోలు, పీఏసీఎస్ డైరెక్టర్లు బాశెట్టి ప్రవీణ్, రాజేశ్వర్, వివిధ గ్రామాల రైతులు తదితరులు ఉన్నారు.

జాతీయ సెమినార్ విజయవంతం చేయాలి

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 3,4 తేదీల్లో నిర్వహించే రెండు రోజుల జాతీయ సెమినార్‌ను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో అధ్యాపకులతో కలిసి సెమినార్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ఆర్థిక విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి సౌజన్యంతో 'వ్యవసాయంలో వైవిధ్యం–భారత ఆర్థిక వ్యవస్థలో కొత్త పోకడలు' అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ ఎం.సరస్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

ఆహారప్యాకెట్లు పంపిణీ

నిర్మల్‌ఖిల్లా: ప్లంబర్స్ డే పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలో యాచకులు, అనాథలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. ప్లంబర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నిగులపు సురేందర్, సతీశ్ మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేసి ప్లంబర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో మీర్జా మక్షుద్, రత్నాపురం అనిల్, నారాయణ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ తరలిన బీజేపీ శ్రేణులు

ఖానాపూర్: హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ సోషల్ మీడియా వారియర్స్ సభకు ఖానాపూర్ నుంచి ఆ పార్టీ నాయకులు వాహనాల్లో తరలివెళ్లారు. అంకం మహేందర్, పి.గణేశ్, బుర్ర రమేశ్, గోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, లింబాద్రి, ఉపేందర్, మనోజ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

విధ్వంసం సృష్టించిన లారీ

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్ ప్రాంతంలో మంగళవారం ఓ లారీ విధ్వంసం సృష్టించింది. స్థానికుల కథనం ప్రకారం శివాజీచౌక్ ప్రాంతంలోని ఓ షాపింగ్‌మాల్ సమీపంలో రెడీమిక్సర్ లారీని డ్రైవర్ పార్క్ చేసి వెళ్లాడు. ఈలోపు వాహనం హ్యాండ్ బ్రేక్ తొలగిపోయి లారీ ముందుకు దూసుకెళ్లింది. దీంతో ముందు నిలిపి ఉన్న కారు, రెండు బైక్‌లు, ఆటో దెబ్బతిన్నాయి. అక్కడా ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు పూర్తిగా దెబ్బతింది. ఈ విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై అశోక్ అక్కడకు చేరుకొని ఘటనకు కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

నర్సాపూర్ (జి): మండల కేంద్రంలోని గురుకృపా జనరల్ స్టోర్ మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. విద్యుత్ అధికారులు కరెంటు సరఫరా నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పింది. గ్రామస్తులు మంటలు ఆర్పివేసేటప్పటికే దుకాణంలోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఎస్సై హన్మాండ్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అధికారులు పరిశీలించి పరిహారం ఇప్పించాలని దుకాణ యజమాని సాయికృష్ణగౌడ్ వేడుకున్నాడు.

టీజీవీపీ క్యాలెండర్ ఆవిష్కరణ

నిర్మల్‌రూరల్: తెలంగాణ విద్యార్థి పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో డీఐఈవో పరశురాం మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ విద్యార్థి పరిషత్ విద్యార్థుల అభ్యున్నతి కోసం చేస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. ట్రస్మా ప్రెసిడెంట్ చంద్రగౌడ్, ఎంఈవో శంకర్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్, పట్టణ కన్వీనర్ జుమెరత్ సాయిచరణ్, కోకన్వీనర్ జాదవ్ మిథున్, చౌహాన్ సచిన్, రాథోడ్ చౌహాన్, జైకుమార్, జాదవ్ మనోరాజ్, రాథోడ్ బాలాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కిడ్డీబ్యాంకులు అందజేత

లక్ష్మణచాంద: చిన్నతనం నుండే పొదుపు అలవాటు చేసేందుకు విద్యార్థులకు కిడ్డీ బ్యాంకులు అందించినట్లు మండలంలోని పీచర ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విద్యారాణి పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులు హంసలత, మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై ఎస్‌బీఐ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. బ్యాంకు సిబ్బంది రవీందర్, రమేశ్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, సామాజిక భద్రత, పొదుపుపై అవగాహన కల్పించారు. కార్యదర్శి గాయత్రి ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిర్మల్: సారంగపూర్ మండలంలోని బోరిగాం, మహావీర్‌తండా గ్రామాల్లో ఉపాధి నిధులు రూ.10లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం బీజేపీ నాయకులు ప్రారంభించారు. బీజేపీ మండలాధ్యక్షుడు విలాస్, గంగారెడ్డి, సిద్ధాపూర్ గణపతి, మధు, సాహెబ్‌రావు, చంద్రప్రకాశ్‌గౌడ్, సిద్ధాపూర్ శేఖర్, మహేశ్‌రెడ్డి, రతన్, రంజిత్, సంతోష్, ఉదయ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

సన్మానం

లక్ష్మణచాంద: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని బాబాపూర్ తాజా మాజీ సర్పంచ్ శ్రీవిద్యను సన్మానించారు. ఆమె చేసిన సేవలకు డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు సన్మానించారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారంలో ఉపాధిహామీ పథకం కింద రూ.10 లక్షలతో చేపట్టే డ్రెయినేజీ నిర్మాణపనులకు బీజేపీ నాయకులు భూమిపూజ చేశారు. అయిండ్ల శ్రీధర్ రెడ్డి, చిన్నయ్యపటేల్, నాగులలింగం, రాజు, ఎంపీటీసీ రాజేశ్వర్, మహిపాల్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో సాయన్న అనే రైతుకు చెందిన మొక్కజొన్న చేనుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పంట కాలి బూడిదైంది. రెండు రోజుల కిందట పంటను కోసి నూర్పిడి కోసం కుప్పలుగా ఉంచాడు. మంగళవారం చేనుకు వెళ్లి చూసేసరికి 15 క్వింటాళ్ల మేర పంట కాలిబూడిదైనట్లు బాధిత రైతు తెలిపారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని పేర్కొన్నాడు. ప్రభుత్వం స్పందించి రైతుకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని స్థానికులు కోరారు.



కాలిబూడిదైన మొక్కజొన్న పంట

ఉదయమే ఉపాధి పనులకు రావాలి

సోన్: ఎండలు ప్రారంభమైనందున ఉదయం వచ్చి తొందరగా ఉపాధి పనులు పూర్తి చేసుకొని ఇళ్లకు వెళ్లాలని జెడ్పీ సీఈవో గోవింద్ కూలీలు, సిబ్బందికి సూచించారు. మండలంలోని న్యూవెల్మల్ బొప్పారం గ్రామాల్లో మంగళవారం జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. అనంతరం ఇరు గ్రామాల్లో పంచాయతీ రికార్డులు, నర్సరీలు పరిశీలించారు. మొక్కలకు నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ అంకుల్ నాగయ్య, ఎంపీడీవో సురేశ్, ప్రత్యేకాధికారి రాజమల్లు, ఏపీఓ మంజులారెడ్డి, కార్యదర్శులు భూపాల్‌రెడ్డి, లక్ష్మణ్, టీఏ కృష్ణ, సంధ్య, ఎఫ్ఏ లక్ష్మణ్, రాచకొండ సాగర్, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



న్యూవెల్మల్‌లో పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ గోవింద్

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి (కే) సుద్దవాగు నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆర్‌ఐ సుమలత పేర్కొన్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రూ.ఐదువేల జరిమానా

నర్సాపూర్ (జి) మండలంలోని అర్లి(కే) సుద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని రూ.ఐదు వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. రాయల్టీ లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

'అల్లోల'ను చేర్చుకోవద్దని నిరసన

లక్ష్మణచాంద: మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ మాట్లాడారు. ఐకేరెడ్డి అవినీతిని చూసి ప్రజలు ఇటీవల ఎమ్మెల్యేగా ఓడించారన్నారు. ఆయనను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని కోరుతూ మండలశాఖ ఆధ్వర్యంలో చేసిన తీర్మానాన్ని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు.. పీసీసీకి పంపినట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు అట్ల రవీందర్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, నారాగౌడ్, రవీందర్ రెడ్డి, నరేశ్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నర్సయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసనలో మాట్లాడుతున్న నాయకులు

గ్రామాల్లో నీటి సమస్య రానీయొద్దు

కుభీర్: గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల సమావేశంలో మాట్లాడారు. భగీరథ పైపులైన్‌కు లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయించాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టి వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న అధికారి

తెల్లవారుజామున పారిశుధ్య పనుల తనిఖీ

ఖానాపూర్: పట్టణంలో పారిశుధ్య పనులను మంగళవారం తెల్లవారుజామున మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, కూడళ్లలో స్వచ్ఛత పనులను పరిశీలించారు. చెత్తను ఆటోల ద్వారా డంపింగ్‌యార్డులకు తరలించాలని సూచించారు. అశోక్‌నగర్ కాలనీలో తాగునీటి బావి వద్ద మోటారు పైపులకు మరమ్మతులు చేయించారు. షబ్బీర్‌పాషా, మానాల శంకర్ ఉన్నారు.



సిబ్బంది హాజరు పరిశీలిస్తున్న చైర్మన్ సత్యం

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్‌టౌన్: గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలకు అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని..దరఖాస్తుల స్వీకరణ నిరంతరం కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

గ్రామాల్లో గడ్డిక్షేత్రాలు పరిశీలన

ఖానాపూర్: పశుపోషణలో భాగంగా మండలంలోని సింగాపూర్, బావాపూర్(ఆర్), పాతతర్లపాడ్, సత్తనపల్లి, ఎర్వచింతల్, బీర్నంది, పాతఎల్లాపూర్ గ్రామాల్లోని రైతులకు గతేడాది ఉచితంగా గడ్డి విత్తనాలను అందజేశారు. రిలయన్స్ ఫౌండేషన్, డ్రీమ్స్ సొసైటీ ఆధ్వర్యంలో అందించిన గడ్డిక్షేత్రాలను మంగళవారం సొసైటీ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తాము అందజేసిన విత్తనాల ద్వారా వచ్చిన గడ్డిని తిన్న పశువుల్లో పాలచిక్కదనం, కొవ్వు, వెన్నశాతం, పాల దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం పాతతర్లపాడ్‌లో విజయ డెయిరీ నుంచి వచ్చిన ఫ్యాట్ టెస్టింగ్ మిషన్‌ను అందజేశారు. కార్యక్రమంలో చిన్నయ్య, మానస, గంగాధర్, భీంరావు, శేఖర్, వనజ, మధులత, లావణ్య, మమత, వెంకటేశ్, తదితరులు ఉన్నారు.

సికింద్రాబాద్ తరలిన మహిళలు

ఖానాపూర్: మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి మంగళవారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన మహిళాశక్తి విధాన ఆవిష్కరణ కార్యక్రమానికి ఖానాపూర్ నుంచి పలువురు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బస్సును మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ మనోహర్, మహిళలు ఉన్నారు.

కుంటాల: మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి మంగళవారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో నిర్వహించిన మహిళాశక్తి కార్యక్రమానికి మండలంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు వెళ్లారు. ఏపీఎం అశోక్, మహిళలు ఉన్నారు.



ఖానాపూర్ నుంచి వెళ్తున్న మహిళలు